సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం ; 17 ; జనవరి ; 2023



కొత్త పాలన షురూ..

ఈనెల 12న ప్రారంభమైన కొత్త కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంతో పాలన ప్రారంభమైంది.

8లో

సంక్రాంతి సందడి..

జిల్లాలో మూడు రోజుల పాటు సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న వారు తమ సొంతూళ్లకు రావడంతో పల్లెలన్నీ కళకళలాడాయి. లోగిళ్లలో ముగ్గులు, పిండివంటలు, భోగి మంటలు, కోడి పందాలతో అంతటా సందడి నెలకొంది.

9లో



టేకులపల్లిలో తన నివాసం ఎదుట ముగ్గు వేస్తున్న ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ

న్యూస్‌రీల్

శ్రీ కనకదుర్గమ్మ తల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న బస్వరాజు సారయ్య

పాల్వంచరూరల్: మండల పరిధిలో వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారికి అర్చకులు అభిషేకంతో పాటు విశేష పూజలు నిర్వహించారు. మకర సంక్రాంతికి తోడు ఆదివారం కావడంతో భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారు. తలనీలాలు, ఒడిబియ్యం, చీరలు, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, సంక్రాంతి రోజున ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఈఓ రజినీకుమారి, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు.

గణతంత్ర ఏర్పాట్లపై సమీక్ష

సూపర్‌బజార్(కొత్తగూడెం): గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ అనుదీప్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేడుకల్లో ప్రసంగ పాఠం తయారీకి అన్ని శాఖల అధికారులు సాధించిన ప్రగతిపై నివేదికలు అందజేయాలని అన్నారు. ప్రగతి మైదానాన్ని శుభ్రం చేయాలని సూచించారు. పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు షెడ్యూల్ తయారు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారికి సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె. వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'బాలనాగమ్మ'



బాలనాగమ్మ నాటకంలోని ఓ సన్నివేశం

కొత్తగూడెంటౌన్: శ్రీవినాయక నాట్య మండలి(సురభి) ఆధ్వర్యంలో కొత్తగూడెం క్లబ్‌లో సోమవారం ప్రదర్శించిన బాల నాగమ్మ నాటకం అందరినీ ఆకట్టుకుంది. కలెక్టర్ అనుదీప్ నాటకాన్ని వీక్షించి కళాకారులు ఆర్.వేణుగోపాలరావు, బద్ది కోటేశ్వరావు తదితరులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతరించిపోతున్న కళలను నమ్ముకుని జీవిస్తున్న కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. కాగా, పంగల్ రాజ వంశానికి చెందిన నరబోజ అనే రాజు కథను ఆకట్టుకునేలా ప్రదర్శించిన ఈ నాటకం ప్రేక్షకులను రంజింపజేసింది. మాయలఫకీర్‌గా ఆర్.వేణుగోపాలరావు నటనను పలువురు ప్రశంసించారు.

● కృపియా ధ్యాన్‌దే.. ఈ రైలు రద్దయింది..

'బెళగావి'కి రెడ్ సిగ్నల్

కొల్హాపూర్ స్థానంలో బెళగావి ఎక్స్‌ప్రెస్

- 17న కొత్త రైలు ప్రారంభమంటూ ప్రకటన
- చివరి నిమిషంలో చోటుచేసుకున్న మార్పులు
- మణుగూరు బదులు సికింద్రాబాద్‌కే పరిమితం
- జిల్లా వాసులకు మరోసారి మొండిచేయి



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : రాష్ట్ర రాజధానికి మరో రైలు అందుబాటులోకి వస్తుందనే సంతోషాన్ని రైల్వేశాఖ ఆదిలోనే చిదిమేసింది. పండగ కానుకగా కొల్హాపూర్ స్థానంలో బెళగావి ఎక్స్‌ప్రెస్ ప్రవేశపెడుతున్నట్టుగా ప్రకటించి, చివరి నిమిషంలో రద్దు చేసింది. ఫలితంగా హైదరాబాద్ ఐటీ కారిడార్‌తో నేరుగా రైల్వే కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చిందనుకున్న జిల్లా వాసులకు నిరాశే ఎదురైంది.

జిల్లా మీదుగా రాకపోకలు సాగిస్తూ కరోనా సమయంలో రద్దయిన రైళ్లలో చాలావరకు తిరిగి ట్రాక్ మీదకు వచ్చాయి. కానీ భద్రాచలం రోడ్ – డోర్నకల్, మణుగూరు – కాజీపేట, మణుగూరు – కొల్హాపూర్ రైళ్లు ఇంకా ప్రారంభం కాలేదు. ఈ మూడు రైళ్లను పునఃప్రారంభించాలనే డిమాండ్ల నేపథ్యంలో బెళగావి – సికింద్రాబాద్ – మణుగూరు ఎక్స్‌ప్రెస్‌ను జనవరి 17న ప్రారంభిస్తున్నట్టు ఈనెల 11న రైల్వేశాఖ ప్రకటించింది. 17న బెళగావిలో ప్రారంభమయ్యే రైలు 18 ఉదయం సికింద్రాబాద్‌కు, అక్కడి నుంచి మధ్యాహ్నం మణుగూరు చేరుకుంటుందని, అదే రోజు మణుగూరు నుంచి తిరుగు ప్రయాణమై సికింద్రాబాద్ మీదుగా బెళగావి వెళ్తుందని తెలిపింది. ఇలా మూడు నెలల పాటు ప్రత్యేకంగా ఈ రైలును నడిపిస్తామని, ప్రయాణికుల నుంచి వచ్చే ఆదరణను బట్టి రెగ్యులర్ రైలుగా మారుస్తామని ప్రకటించింది.

రద్దు చేస్తూ 15న నిర్ణయం..

కొత్త రైలుకు సంబంధించిన ప్రకటన వెలువడినా భద్రాచలం రోడ్, మణుగూరు స్టేషన్లలో ఇందుకు సంబంధించి ఎలాంటి ప్రత్యేక ఏర్పాట్లు లేకపోవడంతో మరోసారి సందేహాలు వ్యక్తమయ్యాయి. పండగకు సొంతూళ్లకు వచ్చిన వారు హైదరాబాద్‌కు తిరిగి వెళ్లేందుకు బెళగావి రైలులో రిజర్వేషన్ కోసం ప్రయత్నించగా ఆన్‌లైన్‌లో ఈ రైలు కనిపించడం లేదు. స్టేషన్లలోని రిజర్వేషన్ కౌంటర్లలో సంప్రదించినా సరైన సమాధానం రాలేదు. దీంతో రైలు ఉంటుందా లేదా అనే అనుమానాలు మరింత బలపడ్డాయి. వాటిని నిజం చేస్తూ బెళగావి ఎక్స్‌ప్రెస్ మణుగూరు నుంచి ప్రారంభం కావడం లేదంటూ సౌత్ వెస్ట్ రైల్వే జోన్ నుంచి మరో ప్రకటన 15 సాయంత్రం ఆరు గంటలకు ట్విటర్‌లో వెలువడింది. కొత్త నిర్ణయం ప్రకారం బెళగావి – సికింద్రాబాద్ – మణుగూరు ప్రత్యేక రైలు రద్దు కాగా, బెళగావి – సికింద్రాబాద్ వరకే పరిమితమైంది.

వెల్లువెత్తుతున్న విమర్శలు..

కర్నాటకలోని బెళగావి నుంచి సికింద్రాబాద్, కాజీపేట, మహబూబాబాద్, డోర్నకల్, భద్రాచలం రోడ్ మీదుగా మణుగూరు వరకు కొత్త ఎక్స్‌ప్రెస్ రైలును నడుస్తుందని రైల్వే శాఖ ప్రకటించింది. పేరు, గమ్యస్థానం విషయంలో తేడాలు ఉన్నప్పటికీ ఈ రైలు టైం టేబుల్, ఆగే స్టేషన్ల పరంగా పరిశీలిస్తే మణుగూరు – కాజీపట – సికింద్రాబాద్ – లింగంపల్లి – వికారాబాద్ సెక్షన్ల వరకు గతంలో ఉన్న కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రత్యామ్నాయంగా నిలిచింది. ఉదయం, రాత్రి తో పాటు మధ్యాహ్నం వేళ జిల్లా కేంద్రం నుంచి నేరుగా రాష్ట్ర రాజధానికి కొత్త రైలు అందుబాటులోకి వచ్చిందని జిల్లా వాసులు సంతోషం వ్యక్తం చేశారు. అయితే.. చివరి నిమిషంలో రైలు రద్దు చేయడంతో రైల్వేశాఖ తీరుపై నలు వైపులా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రెండు రోజుల్లోనే

బెళగావి – మణుగూరు రైలు ప్రారంభంపై జనవరి 11న రైల్వేశాఖ అంతర్గత సర్క్యులర్ జారీ చేసింది. అయితే రెండు రోజుల్లోనే తీసుకున్న నిర్ణయం నుంచి వెనక్కి తగ్గింది. కొత్త రైలును సికింద్రాబాద్ – మణుగూరు మధ్య నడిపించడం ఇప్పుడే కుదరదంటూ 13న మరో సర్క్యులర్ జారీ చేసినట్టు సమాచారం. అయితే ఈ విషయం బయటకు పొక్కలేదు.

రామయ్యకు రథోత్సవం

- ముగిసిన విలాసోత్సవాలు
- రామాలయంలో భక్తుల సందడి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో ఆదివారం సంక్రాంతిని పురస్కరించుకుని రామయ్యకు రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది మకర సంక్రాంతి రోజున స్వామివారికి ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీ. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో సీతాలక్ష్మణ సమేతుడైన రామచంద్రస్వామిని ఆసీనులను చేసి ప్రత్యేక పూజలు గావించారు. దేవస్థానం నుంచి గోవిందరాజు స్వామి వారి ఆలయం వరకు తిరువీధి సేవ నిర్వహించారు. తమ ఇంటి ముందుకు వచ్చిన స్వామివార్లకు భక్తులు నీరాజనం పలికారు. పూలు, పండ్లు, హారతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బి శివాజీ, ఏఈఓ శ్రవణ్‌కుమార్ దంపతులు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.



స్వామివారికి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ముగిసిన విలాసోత్సవాలు..

వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారికి జరుగుతున్న విలాసోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. శ్రీరామ నిలయం వద్ద గల వశిష్ట మండపంలో ఆదివారం దేవస్థానం ఉద్యోగుల ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరిపారు. ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారిని మేళతాళాలు, కోలాటాల నడుమ తీసుకొచ్చి మండపంలో కొలువుదీర్చారు. ఆలయ అర్చకులు పూజలు చేసి హారతి సమర్పించారు. స్థానిక కళాకారులచే సాంస్కృతి కార్యక్రమాలు జరిపారు. కాగా, ఈ నెల 19న బేడా మండపంలో స్వామి వారికి విశ్వరూప సేవ జరగనుంది. ఇక బేడా మండపంలో స్వామివారి నిత్యకల్యాణ వేడుకను కనుల పండువగా నిర్వహించారు.



రామాలయంలో భక్తుల రద్దీ..

భక్తజన సందోహం..

సంక్రాంతి సెలవులు కావడంతో రామాలయం భక్తులతో సందడిగా మారింది. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులతో పాటు పాపికొండల యాత్రకు వచ్చిన పర్యాటకులు సైతం స్వామి వారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. ఆది, సోమవారాల్లో స్వామి వారికి జరిగిన ఆర్జిత సేవల్లో పాల్గొని, మూలమూర్తులను దర్శించుకున్నారు.

యుద్ధానికి బీఆర్‌ఎస్ సిద్ధం

- ఖమ్మంలో ఆరంభం.. హస్తినలో ముగింపు
- వంద ఎకరాల్లో ఐదు లక్షల మందితో భారీ సభ
- కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేస్తున్నాం
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి అజయ్‌కుమార్



ఐదు లక్షల మందితో భారీ సభ..

నూతన కలెక్టరేట్ సమీపాన ఈనెల 18న వంద ఎకరాల్లో నిర్వహించే బహిరంగ సభకు భారీ స్థాయిలో జన సమీకరణ చేపట్టగా, ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎవరికి కేటాయించిన బాధ్యతలు వారు చక్కగా నిర్వర్తిస్తున్నారు. మొత్తం 13 నియోజకవర్గాల నుంచి దాదాపు 5 లక్షల మందిని తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వీలైనన్ని వాహనాలను సమకూర్చి, సభకు హాజరయ్యే వారికి ఇబ్బంది కలగకుండా పార్కింగ్, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తున్నాం.

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'కేంద్రంలోని భారతీయ జనతాపార్టీ అనుసరిస్తున్న విధానాలపై యుద్ధానికి బీఆర్‌ఎస్ సిద్ధమైంది. ఇందుకు వేదికగా ఖమ్మం నుంచే రాజకీయ అస్త్రాలను ఎక్కుపెడుతోంది.. దేశ రాజకీయ గతిని మార్చే శక్తి బీఆర్‌ఎస్‌కే ఉంది.. ఆదిశగా దేశంలోని ప్రజలను చైతన్యవంతులను చేసే ప్రక్రియ ఖమ్మం నుంచే అంకురార్పణ జరుగుతుండటం మాకు గర్వకారణం'. అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఈనెల 18న నిర్వహించే బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభకు భారీ ఎత్తున జన సమీకరణ చేస్తున్నట్లు చెప్పిన ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు ముగ్గురు సీఎంలు, ఒక మాజీ సీఎం పాల్గొంటున్న సభ ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. బీఆర్‌ఎస్ సభకు జన సమీకరణ తదితర అంశాలపై సోమవారం మంత్రి పువ్వాడ 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలు వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే..

ఖమ్మం నుంచే గురి..

బీఆర్‌ఎస్ తొలి సభను ఖమ్మంలో ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించడానికి ఒక కారణం ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా చైతన్యవంతమైన ప్రాంతం కావడంతో ఇక్కడి ప్రజలు మతతత్వ శక్తులను ప్రోత్సహించరు. బీఆర్‌ఎస్ విధానాలు, లక్ష్యాలతోపాటు జాతీయ పార్టీ ప్రారంభించడానికి దారి తీసిన పరిస్థితులను ఈ వేదిక నుంచే వివరిస్తారు. కేంద్రంలోని బీజేపీ తీరుతో దేశం నష్టపోతున్న తీరును సీఎం కేసీఆర్ తెలియజేస్తారు. దేశ రాజకీయాల్లో సరికొత్త ఒరవడిని సృష్టించడమే బీఆర్‌ఎస్ లక్ష్యం కాగా.. ఇందుకు ప్రధాన వేదికవుతున్న ఖమ్మం దేశ రాజకీయ చరిత్ర పుటల్లోకి ఎక్కనుంది.

ఈ కారణంతోనే బీఆర్‌ఎస్..

భారతీయ జనతాపార్టీ తీరుతో ప్రతిపక్షాలన్నీ నిర్వీర్యమయ్యాయి. దేశంలో లౌకికవాద విలువలు కరువవుతున్నాయి. వీటిని కాపాడేందుకు అందరం నడుం బిగించాలి. కేసీఆర్ నేతృత్వంలో ఏర్పాటైన బీఆర్‌ఎస్ ఎలాంటి రాజీ లేకుండా లౌకికవాదం కోసం నిలబడుతుంది. రాజకీయాలు, మతాలను వేరుగా చూడాలనే ప్రాథమిక సూత్రాన్ని, ప్రగతిశీల విధానాన్ని బీఆర్‌ఎస్ పాటిస్తుంది. బీజేపీ – ఆర్‌ఎస్‌ఎస్‌పై పోరాటానికి పార్లమెంట్‌లో లౌకిక ప్రగతిశీల శక్తులను బలోపేతం చేయడం అవసరం. బీజేపీని దీటుగా ఎదుర్కొనేందుకు ఆవిర్భవించిన బీఆర్‌ఎస్.. ఈ పనిని సమర్థవంతంగా చేస్తుందనే విశ్వాసం అందరిలో ఉంది.

భవిష్యత్ కూడా మాదే..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ బలంగా ఉంది. వచ్చే ఎన్నికల్లో పదికి పది సీట్లు సాధించడం గొప్ప విషయమేం కాదు. జిల్లాలో కమ్యూనిస్టుల ప్రభావం కూడా ఉంది. మతతత్వ శక్తులను మట్టి కరిపించేందుకు బీఆర్‌ఎస్ దారిలో కమ్యూనిస్టులు కూడా కలిసొస్తుండడం, ఈ చారిత్రక వేదికకు ఖమ్మం పునాది అవుతుండటం సంతోషంగా ఉంది. ఇదేస్ఫూర్తితో ముందుకు వెళ్లి ఉమ్మడి జిల్లాలో విజయదుందుభి మోగిస్తాం. బీజేపీకి ఉమ్మడి జిల్లాలో స్థానం లేకపోగా, ప్రజలు ఆ పార్టీని ఆదరించేందుకు సిద్ధంగా లేరు. ఇక కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు క్షీణిస్తోంది.

బీజేపీలో చేరితే ఓటమిని ఆహ్వానించడమే..

ఉమ్మడి జిల్లాలో ఎవరైనా బీజేపీలో చేరడం అంటే ఓటమిని ఆహ్వానించడమే. బీజేపీకి ఇక్కడ సంస్థాగత బలం లేదు. ఈ ప్రాంత హిందూ, ముస్లింలు, క్రిస్టియన్లు అందరూ కలిసి మెలసి ఉంటారు. ఈ నేపథ్యాన ఎవరైనా బీజేపీలో చేరితే కోరి ఓటమిని కొని తెచ్చుకున్నట్లే. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ హవా కొనసాగడం తథ్యం.

20న విద్యుత్ వినియోగదారుల సమావేశం

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ వినియోగదారుల సమస్యలు, పరిష్కార మార్గాలపై ఈనెల 20న కొత్తగూడెం క్లబ్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఎస్‌ఈ రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 వరకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ప్రతినిధులతో ముఖాముఖి సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సభకు సన్నద్ధం

- బీఆర్‌ఎస్ సభకు పూర్తి కావొచ్చిన ఏర్పాట్లు
- 13 నియోజకవర్గాల నుంచి జన సమీకరణ
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ
- బందోబస్తుకు ప్రత్యేకంగా ఆరుగురు సీనియర్ ఐపీఎస్‌లు



సభాప్రాంగణానికి వెళ్లే మార్గంలో ఏర్పాట్లుచేసిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం గుమ్మంలో జరగనున్న బీఆర్‌ఎస్ బహిరంగ సభకు ఏర్పాట్లన్నీ చివరి దశకు చేరాయి. రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ఈనెల 18న నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవంతోపాటు రాష్ట్రస్థాయిలో కంటివెలుగు కార్యక్రమం రెండో దశ ప్రారంభం.. ఆతర్వాత భారీ బహిరంగ సభ జరగనుండడంతో బీఆర్‌ఎస్ నాయకగణం అంతా ఖమ్మంలోనే మకాం వేసింది. ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు మూడు రాష్ట్రాల సీఎంలు, అలాగే మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్‌యాదవ్, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరవుతుండటంతో ఏర్పాట్లను ఇటు బీఆర్‌ఎస్ నాయకత్వంతోపాటు అటు అధికార, పోలీస్ యంత్రాంగం దగ్గరుండి పర్యవేక్షిస్తోంది.

ఖమ్మం గులాబీ మయం

బీఆర్‌ఎస్ సభ నేపథ్యాన ఖమ్మం గులాబీమయమైంది. సూర్యాపేట, కోదాడ, ఇల్లెందు, వరంగల్, వైరా, భద్రాచలం రోడ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు ఉమ్మడి జిల్లా ప్రముఖులు, సభకు హాజరయ్యే సీఎంలు, జాతీయ స్థాయి నేతల ఫొటోలతో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటయ్యాయి. దారి పొడవునా ఏర్పాటు చేయడంతో గులాబీ కళ ఉట్టిపడుతోంది. బహిరంగ సభావేదిక, ప్రాంగణంలో ఏర్పాట్లు మంత్రి హరీశ్‌రావు పర్యవేక్షణలో జరిగాయి. వేదికపై ముఖ్యఅతిథులతోపాటు ఉమ్మడి జిల్లా ముఖ్యప్రజాప్రతినిధులు, నేతలు కూర్చోవాలని ఇప్పటికే ఆదేశాలు అందాయి. వేదిక ముందు ఏర్పాటు చేసిన గ్యాలరీల్లో రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చే ముఖ్యప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, ఉద్యమకారులకు స్థానాలు కేటాయిస్తున్నారు.

భారీ బందోబస్తు

ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు మరో ముగ్గురు సీఎంలు, ఒక మాజీ సీఎం, జాతీయస్థాయి పార్టీల నేతలు సభకు హాజరవుతుండటంతో బందోబస్తుపై పోలీసు యంత్రాంగం దృష్టి సారించింది. ట్రాఫిక్ చిక్కులు లేకుండా చూస్తూనే నిఘా ఏర్పాటుచేశారు. ముఖ్యమంత్రుల పర్యటనకు సంబంధించి ఆరుగురు సీనియర్ ఐపీఎస్‌లకు బాధ్యతలు కేటాయిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. అడిషనల్ డీజీ విజయ్‌కుమార్, ఐజీలు షానవాజ్‌ఖాసిం, చంద్రశేఖర్‌రెడ్డి, డీఐజీ, వరంగల్ సీపీ ఏ.వీ.రంగనాథ్, జోగుళాంబ గద్వాల డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్, సిరిసిల్ల జోన్ డీఐజీ రమేష్‌నాయుడుతో పాటు భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల ఎస్పీలు వినీత్, శరత్‌చంద్ర పవార్‌కు బాధ్యతలు అప్పగించారు. అంతేకాక పది మంది ఏఎస్పీలు, 39మంది ఏసీపీలు, 139మంది ఇన్‌స్పెక్టర్లు, 409మంది ఎస్సైలు, 1,772 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, 169 మంది మహిళా కానిస్టేబుళ్లు, 1,005 హోంగార్డులు, 120మంది స్పెషల్ పార్టీ పోలీసులు ఇతరత్రా కలిపి 4,198 మందితో బందోబస్తు చేపట్టనున్నారు.

భారీగా జన సమీకరణపై నజర్

ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల నుంచి సుమారు ఐదు లక్షల మంది వరకు జన సమీకరణపై బీఆర్‌ఎస్ పార్టీ దృష్టి సారించింది. ఈ ప్రాంతాల్లో సన్నాహక సమావేశాలు కూడా ముగియగా, మంత్రి హరీశ్‌రావు పర్యవేక్షణలో ఏ నియోజకవర్గం నుంచి ఎందరిని తరలించాలనే కసరత్తు పూర్తయింది. ఆయా నియోజకవర్గాల నుంచి వాచ్చే వారి వాహనాల కోసం 20 పార్కింగ్ ప్రాంతాలను కేటాయించడమే కాక పోలీసు యంత్రాంగం రూట్‌మ్యాప్, పార్కింగ్ ప్రాంతాల వివరాలను వెల్లడించింది. మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కలెక్టరేట్, సభ ప్రాంగణంలో ఉండి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు.



సిద్ధమైన సభావేదిక, ప్రాంగణం

'వెలుగు'కు వేళాయె..

- రేపటి నుంచి రెండో విడత కంటివెలుగు
- జిల్లాలో 19 నుంచి పరీక్షలు ప్రారంభం
- వంద రోజుల్లో పూర్తి చేసేలా కార్యాచరణ
- నిర్వహణకు 48 బృందాల ఏర్పాటు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

చుంచుపల్లి: ఈనెల 18న సీఎం కేసీఆర్ రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనుండగా జిల్లాలో 19 నుంచి పరీక్షల నిర్వహణకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేసింది. కంటివెలుగు విజయవంతానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. క్యాంపుల నిర్వహణకు మొత్తం 48 టీమ్‌లను ఏర్పాటు చేయగా, ఒక్కో బృందంలో ఐదు నుంచి ఆరుగురు వైద్య సిబ్బంది ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలోని 481 గ్రామపంచాయతీలు, 104 మున్సిపల్ వార్డుల పరిధిలో క్యాంపులు ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 100 రోజుల ప్రభుత్వ పనిదినాల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాల్సి ఉంటుంది. క్యాంపుల నిర్వహణ బాధ్యతలను గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలకు అప్పగించారు. ఆయా గ్రామాల్లో క్యాంపుల తేదీలను చాటింపు, మైక్ ప్రచారాల ద్వారా ప్రజలకు ముందుగానే తెలియజేయాల్సిన బాధ్యత పంచాయతీలదే. దూర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు క్యాంపులకు వచ్చేలా వాహనాలను సైతం ఏర్పాటుచేయాలి. కంటివెలుగు కార్యక్రమాన్ని సక్సెస్ చేసేందుకు జిల్లా వైద్యశాఖ ఇప్పటికే వివిధ పీహెచ్‌సీల వైద్యాధికారులకు శిక్షణ ఇవ్వడంతో పాటు తాజాగా మాక్‌డ్రిల్ నిర్వహించింది. కంటి వెలుగుకు కావలసిన యంత్రాలు, కళ్లద్దాలు జిల్లాకు చేరుకున్నాయి.

7,90,398 మందికి పరీక్షలు..

రాష్ట్ర ప్రభుత్వం తొలిసారి 2018 ఆగస్టు 15 నుంచి 2019 మార్చి వరకు మొదటి విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఇక ఈ నెల 18 నుంచి రెండోవిడత కార్యక్రమాన్ని చేపట్టనుంది. మొదటి విడతలో లక్షల మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లద్దాలు అందించారు. ఇక రెండో విడతలో 7,90,398 మందికి కంటి పరీక్షలు నిర్వహించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన 48 టీమ్‌లలో రూరల్ పరిధిలో 37, అర్బన్ పరిధిలో 11 టీమ్‌లు పని చేస్తాయి. టీమ్‌లోని సభ్యుల్లో ఎవరైనా అనారోగ్యానికి గురైతే వారి స్థానంలో మరో టీమ్‌ను ప్రత్యామ్నాయంగా ఉంచారు. ఒక్కో టీమ్‌లో ఒక వైద్యుడు, ఆప్టాలమిస్ట్, ఏఎస్ఎం, సూపర్‌వైజర్, ఆశ వర్కర్లు ఉంటారు. క్యాంపునకు వచ్చే వారికి అక్కడిక్కడే కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపాలను గుర్తిస్తారు. తొలి విడత నిర్వహించిన కంటి వెలుగులో 27 టీమ్‌లు పాల్గొనగా, 333 గ్రామాలు, 82 వార్డుల్లో 2,967 వైద్య శిబిరాలను నిర్వహించి 4,91,344 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 1,70,898 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. మరో 34,262 మందిని వివిధ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. 684 మందికి శస్త్రచికిత్సలు చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



కలెక్టర్ ఆదేశాల మేరకు రెండో విడత కంటి వెలుగును పకడ్బందీగా చేపట్టేందుకు సర్వం సిద్ధం చేశాం. 481 గ్రామ పంచాయతీలు, 104 వార్డుల పరిధిలోని ప్రజలకు కంటి పరీక్షలు చేసేలా ప్రణాళికలు రూపొందించాం. ఇందుకోసం 48 టీమ్‌లను ఏర్పాటు చేశాం. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాం.

– జేవీఎల్ శిరీష, డీఎంహెచ్‌ఓ

విజయవంతం చేయాలి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఖమ్మం కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కంటి వెలుగు కార్యక్రమంపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం కలెక్టర్ అనుదీప్ జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఈనెల 18న ఖమ్మంలో సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని, జిల్లాలో 19 నుంచి క్యాంపులు నిర్వహిస్తామని వివరించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ శిరీష, డీఎస్పీ వెంకటేశ్వరబాబు, డీపీఓ రమాకాంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దళితబంధు దేశానికే ఆదర్శం

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండా శ్రీనివాస్



ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న లబ్ధిదారులు

పినపాక: దళితబంధు పథకం దేశానికే ఆదర్శమని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. పినపాక మండలానికి మంజూరైన దళితబంధు యూనిట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం దళితుల అభివృద్ధి కోసం ఈ పథకం తెచ్చిందని పేర్కొన్నారు. అనంతరం కార్పొరేషన్ చైర్మన్‌ను దళిత బంధు లబ్ధిదారులు సన్మానించారు. వీడి ముత్యం, ఆత్మ చైర్మన్ భద్రయ్య, సొసైటీ చైర్మన్ రవి శేఖర్ వర్మ, ఎంపీఓ శ్రీనివాసులు, పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ అధికారుల ఔదార్యం

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో సీఆర్పీఎఫ్ అధికారులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. సోమవారం బీజాపూర్ జిల్లా పామేడులోని సీఆర్పీఎఫ్ 151 బెటాలియన్ క్యాంపునకు సమీపంలో ఉన్న ఆదివాసీగూడెంలోని ఉంగి పూరిగుడిసెకు మంటలు అంటుకున్నాయి. దీంతో జవాన్లు అక్కడికి చేరుకుని మంటల్లో చిక్కుకున్న ఇద్దరు చిన్నారులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అనంతరం ఇంట్లోని వస్తువులను బయటకు తెచ్చి క్యాంపులో ఉన్న వాటర్ ట్యాంకుతో మంటలను ఆర్పివేశారు. బాధిత కుటుంబానికి దుప్పట్లు, వారం రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను డిప్యూటీ కమాండెంట్ ప్రదీప్‌సింగ్ షెకావత్ చేతుల మీదుగా అందించారు.

జీపు, బొలెరో వాహనం ఢీ

పలువురికి గాయాలు

గుండాల: ఇల్లెందు వైపు వెళ్తున్న జీపు, బొలెరో వాహనం ఎదురెదురుగా ఢీకొని పలువురికి గాయాలైన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని జామరగూడెం గ్రామానికి చెందిన పి.రాములు తన జీపులో కాచనపల్లి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముత్తాపురం మూలమలుపు వద్ద బొలెరో వాహనం ఢీ కొట్టింది. ఈ వాహనం కారేపల్లి మండలం చీమలపాడుకు చెందిన వ్యక్తిది. ఈ ప్రమాదంలో జీపు డ్రైవర్ రాములుకు తీవ్ర గాయాలయ్యాయి. పూనెం శ్రీను, వజ్జ ఎర్రయ్య, పూనెం చక్రవర్తిలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను గుండాల ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

కోడి పందేల శిబిరంపై దాడి

దమ్మపేట: కోడి పందేల శిబిరంపై దాడి చేసి, పందెంరాయుళ్లను అరెస్టు చేసిన సంఘటన మండల పరిధిలోని అంకంపాలెం గ్రామ శివారులోని డబుల్ బెడ్రూమ్‌ల సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అంకంపాలెం గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేశారు. 14 కోడి పుంజులు, రూ.15,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు పందెంరాయుళ్లపై కేసు నమోదు చేశామని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

గీత కార్మికుడి మృతి



ఉత్తేజ్ మృతదేహం

సింగరేణి(కొత్తగూడెం): చుంచుపల్లి మండల పరిధిలోని రాంపురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాటి చెట్టు మీద నుంచి పడి చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఉత్తేజ్(32) కులవృత్తిని నమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజులా గే ఈ నెల 14న తాటి చెట్టు ఎక్కాడు. కల్లుతీసే క్రమంలో ఆయన కట్టుకున్న మోకు (తాడు) ఊడి కింద పడ్డాడు. స్థానికులు గమనించి కొత్తగూడెంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

హౌసింగ్ బోర్డులో యువకుల గొడవ

ఆరుగురిపై కేసు నమోదు

చుంచుపల్లి: చుంచుపల్లి హౌసింగ్ బోర్డు కోటి సెంటర్‌లో ఓ కిరాణం, బెల్ట్ షాపు వద్ద ఆదివారం కొందరు యువకులు మద్యం మత్తులో గొడవపడి షాపు యజమానితో పాటు పలువురిపై దాడికి పాల్పడ్డారు. ప్రధాన రహదారి పక్కన రోజున బాబూక్యాంపు, బర్మాక్యాంపునకు చెందిన పలువురు యువకుల మధ్య వాగ్వాదం నెలకొంది. ఈ నేపథ్యంలో షాపు యజమాని కోటేశ్వరరావు సర్ది చెప్పేందుకు వెళ్లగా కర్రలతో విచక్షణా రహితంగా దాడి చేశారు. దీంతో కోటేశ్వరరావు భార్య సునీతారాణి ఫిర్యాదు మేరకు చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆరుగురు యువకులు మద్దెల జయసూర్య, ప్రణీత్, ఉదయ్, అల్లెపు రాజు, జంపాల రాహుల్, అనుదీప్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,881

‘కొత్త’ పాలన షురూ..

- ప్రజావాణితో ప్రారంభం
- నేటి నుంచి అన్ని శాఖలు ఇక్కడే ఉండాలి
- అధికారులకు కలెక్టర్ అనుదీప్ ఆదేశం



తన స్థానంలో ఆశీనులైన కలెక్టర్ అనుదీప్



కారులో సామగ్రి తరలిస్తున్న సిబ్బంది

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈనెల 12న సీఎం కేసీఆర్ ప్రారంభించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంతో కొత్త పాలన ప్రారంభమైంది. నూతన కలెక్టరేట్‌లో తొలి ప్రజావాణి నిర్వహణ పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తొలి దరఖాస్తును పాల్వంచలోని రాంనగర్‌కు చెందిన అఫ్జల్ పర్వీన్ అందజేశారు. అయితే నెట్‌వర్క్ సమస్య ఉండడంతో ప్రజావాణిలో దరఖాస్తులు ఇచ్చిన వారికి రసీదులు అందించలేకపోయారు. రిసిప్టులు మంగళవారం ఇస్తామని అధికారులు తెలిపారు. కాగా, సోమవారం కనుము పండగ కావడం, నూతన కలెక్టరేట్‌లో కార్యకలాపాలు ప్రారంభమయ్యాయనే సమాచారం పూర్తిస్థాయిలో తెలియకపోవడంతో 23 మంది మాత్రమే దరఖాస్తులు అందజేశారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి..

నూతన కలెక్టరేట్‌లో ఇంకా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించలేదు. ప్రజల కోసం వెయిటింగ్ హాల్ ఉన్నప్పటికీ తాగునీరు అందుబాటులో లేదు. ఇక కార్యాలయం ఎత్తయిన ప్రదేశంలో ఉండడంతో వృద్ధులు, దివ్యాంగులు లోనికి వచ్చేందుకు వీలుగా వీల్‌చైర్, ప్రజల సౌకర్యార్థం ఆవరణలో క్యాంటిన్ ఏర్పాటు చేయాలని తొలిరోజు ప్రజావాణికి వచ్చిన వారు అభిప్రాయపడ్డారు. ఇక జిల్లా అధికారులంతా తమ వాహనాలను కలెక్టరేట్ ప్రాంగణంలోనే పార్కు చేశారు. ఈ విషయాన్ని గమనించిన అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు పార్కింగ్ ప్రదేశంలో మాత్రమే వాహనాలు నిలపాలని సూచించారు.

అన్ని శాఖలు తరలిరావాలి..

నూతన కలెక్టరేట్ ప్రారంభమైనా ఇంకా కొన్ని శాఖల అధికారులు పాత కార్యాలయాల నుంచే విధులు నిర్వహిస్తుండడంతో కలెక్టర్ అనుదీప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన కలెక్టరేట్‌లోకి పూర్తిస్థాయిలో సామగ్రిని ఎందుకు తరలించలేదని ప్రశ్నించారు. మంగళవారం నుంచి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది నూతన కార్యాలయం నుంచే కార్యకలాపాలు సాగించాలని సూచించారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇక నూతన విద్యుత్ మీటర్లు..

ప్రస్తుతం వివిధ శాఖల కార్యాలయాలు కొన్ని సింగరేణి క్వార్టర్లలో, మరికొన్ని అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అక్కడి విద్యుత్ బిల్లుల్లో ఏమైనా బకాయిలు ఉంటే చెల్లించాలని, నూతన కలెక్టరేట్‌లో ఆయా శాఖలకు కేటాయించిన గదుల్లో కొత్త మీటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పాత మీటర్లు ఇక్కడికి షిఫ్ట్ చేసేందుకు వీలుంటుందా అని కలెక్టర్ ఎస్ఈ రమేష్‌ను అడగగా, అది సాధ్యం కాదని చెప్పడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇక నెట్‌వర్క్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని బీఎస్ఎన్ఎల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

బ్యాటరీ బండ్లు ఏర్పాటు చేయాలి



నూతన కలెక్టరేట్ ఎత్తయిన ప్రదేశంలో ఉన్నందున వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం తిరుపతిలో మాదిరిగా రెండు బ్యాటరీబండ్లు ఏర్పాటు చేయాలి. ఈ సమస్య మినహా నూతన కలెక్టరేట్ ప్రజలకు సౌకర్యవంతంగా ఉంది. – గుండపనేని సతీష్, టీవీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు

జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలి



నూతన కలెక్టరేట్ ఎదుట జీబ్రా క్రాసింగ్, సిగ్నల్ లైట్లను ఏర్పాటు చేయాలి. బస్‌స్టాప్‌తో పాటు షెల్టర్ కూడా నిర్మించాలి. కొత్త కలెక్టరేట్ విశాలంగా, ప్రజలకు సౌకర్యవంతంగా ఉంది. – ఎండీ యాకూబ్‌పాషా, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు

బీఆర్ఎస్ సభకు భారీగా ఆర్టీసీ బస్సులు



ఆర్టీసీ బస్సులు

- ఇప్పటికే సర్వీసులు బుక్ చేసుకున్న నేతలు
- సభ రోజు పండుగ ప్రయాణికులకు ఇక్కట్లే..

చుంచుపల్లి: జిల్లాలోని ఆర్టీసీ బస్సులన్నీ బుధవారం ఖమ్మంలో జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభకు బుక్కయ్యాయి. ఈ సభకు ఖమ్మం, వరంగల్, నల్లగొండ ఉమ్మడి జిల్లాల పరిధిలో పార్టీ శ్రేణులు భారీగా జన సమీకరణ చేస్తున్నాయి. ఒక్కో నియోజకవర్గ పరిధిలో 20 నుంచి 30 వేల మందిని సభకు తరలించేలా నాయకులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకు కావాల్సి రవాణా సౌకర్యంపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల ముందుగానే ఆర్టీసీ బస్సులను పార్టీ శ్రేణులు బుక్ చేసుకునే పనిలో ఉన్నాయి. జిల్లాలోని భద్రాచలం, మణుగూరు, కొత్తగూడెం డిపోల పరిధిలో 200కు పైగా బస్సులను బహిరంగసభకు నేతలు సోమవారం అడ్వాన్సులు చెల్లించారు. మణుగూరు డిపో నుంచి 113 బస్సులు, భద్రాచలం నుంచి 50 బస్సులు, కొత్తగూడెం డిపో నుంచి 80 బస్సులకు నేతలు ఇప్పటికే అడ్వాన్స్ చెల్లించారు. మూడు డిపోల పరిధిలో ఉన్న బస్సులే కాకుండా హైదరాబాదు సిటీ నుంచి భారీగా ఆర్టీసీ బస్సులను జిల్లాకు తరలించి ఇక్కడి నుంచి బహిరంగ సభకు పంపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు ఆయా డిపోల మేనేజర్లతో మాట్లాడి మంగళవారం కూడా ఇంకొన్ని బస్సులను అందుబాటులో ఉంచాలని సూచించారు.

పండుగకొచ్చిన ప్రయాణికులకు ఇబ్బందే..

ఆర్టీసీ అధికారులు సూపర్ లగ్జరీ బస్సులను తప్ప మిగతా బస్సులన్నింటినీ సభకు సమకూర్చుతున్నారు. దీంతో డివిజన్ పరిధిలో ఉన్న బస్సుల్లో 75 శాతం బహిరంగ సభకు వెళ్లనున్నాయి. కాగా జిల్లా నుంచి హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, నల్లగొండతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చిన ప్రయాణికులు కుటుంబ సభ్యులతో తిరిగి వెళ్లనున్నారు. సోమవారం కనుమ కావడం తర్వాత మంగళవారం రావడంతో ఎక్కువ మంది బుధవారం ప్రయాణాలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు బస్సులన్నీ బీఆర్ఎస్ బహిరంగ సభకు కేటాయించారు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పేలా లేవు. సీఎం పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు, దారి మళ్లింపులు కూడా ఉంటాయి. ఈ క్రమంలో బుధవారం ప్రయాణాలు రద్దు చేసుకుని, ఆ తర్వాత రోజు వెళ్లడమే మంచిదని ఆర్టీసీ అధికారులు సూచిస్తున్నారు.

కిన్నెరసానిలో పర్యాటక సందడి



డ్యామ్‌పై పర్యాటకులు



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కిన్నెరసాని ప్రాజెక్టుకు ఆది, సోమ వారాల్లో పర్యాటకులు పోటెత్తారు. డీర్ పార్కులోని దుప్పులను, డ్యామ్‌పై నుంచి జలాశయాన్ని వీక్షించారు. రెండు రోజులపాటు 3,110 మంది పర్యాటకులు సందర్శించినట్లు అధికారులు తెలిపారు. వైల్డ్‌లైఫ్ శాఖకు సంక్రాంతి పండుగ రోజు రూ.62,625, కనుమ పండుగ రోజు రూ.42,115 ఆదాయం లభించింది. బోటు షికారు ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు ఆదివారం రూ.33,040, సోమవారం రూ.34,670 లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. – పాల్వంచరూరల్

చలి కాగుతున్న వృద్ధుడిపై కోతుల దాడి

మంటల్లో కాలి.. చికిత్స పొందుతూ మృతి



రత్నం(ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): చలి మంట ఓ వృద్ధుడి ప్రాణం మీదకు తెచ్చింది. ఈ ఘటన రుద్రంపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. రుద్రంపూర్‌లోని జేవీఆర్ ఓసీలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న మందా రవి తండ్రి రత్నం (82) సింగరేణిలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఈనెల 9న చలి విపరీతంగా ఉండడంతో చలి మంట కాగుతుండగా కోతుల గుంపు అతడిపై దాడి చేసింది. దీంతో రత్నం మంటల్లో పడిపోయారు. శరీరమంతా కాలడంతో కుటుంబ సభ్యులు కొత్తగూడెంలోని సింగరేణి ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు.

యువకుడిపై పోక్సో కేసు

ఖమ్మంఅర్బన్: నగరంలోని దానవాయిగూడేనికి చెందిన యువకుడు కార్తీక్‌పై పోక్సో కేసు నమోదైంది. అదే గ్రామానికి చెందిన బాలికను ఆయన ప్రేమ పేరుతో కొంతకాలంగా వేధిస్తున్నాడు. దీంతో బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

డయాలసిస్ పేషంట్ మృతి

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న వ్యక్తి సోమవారం మృతి చెందాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన వెంకటేశ్వర్లు(51) కొన్ని నెలలుగా జిల్లా ఆస్పత్రిలోని డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఈక్రమంలో ఆరోగ్య క్షీణించి సోమవారం ఆయన మృతి చెందాడు. అయితే, సిబ్బంది పట్టించుకోకపోవడంతోనే వెంకటేశ్వర్లు మృతి చెందాడని కుటుంబ సభ్యులు సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు.

నాలుగు తరాలు కలిసిన వేళ

అశ్వాపురం: నాలుగు తరాల కుటుంబ సభ్యులు ఒక్క చోట కలుసుకుని సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని అమ్మగారిపల్లి గ్రామానికి చెందిన గాదె కేశవరెడ్డి సోదరులు, సోదరీమణులు, వారి వారసులు వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. సంక్రాంతి సందర్భంగా అందరూ అమ్మగారిపల్లికి చేరుకుని మూడు రోజులపాటు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి కుమారుడు దేవేందర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.



సంక్రాంతి సంబరాల్లో గాదె వారి కుటుంబసభ్యులు →

చెరువులో తెగిపడ్డ విద్యుత్ తీగ..

తెప్పల మీద వెళ్లి మరమ్మతులు చేపట్టిన విద్యుత్ సిబ్బంది



తెప్పలు వేసుకుని వెళ్లి మరమ్మతులు చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

పాల్వంచ: పట్టణంలోని పాత పాల్వంచ వద్ద గల చింతల చెర్వులోని విద్యుత్ స్తంభాల నుంచి ఆదివారం సాయంత్రం 33 కేవీ విద్యుత్‌లైన్ తెగిపడింది. సీతారాంపట్నం సబ్‌స్టేషన్ నుంచి పాల్వంచ సబ్‌స్టేషన్‌కు ఇన్‌కమింగ్ విద్యుత్ సరఫరా జరిగే ఈ లైన్ సాంకేతిక సమస్యతో అకస్మాత్తుగా తెగిపడింది. తెగిపడిన క్షణాల్లోనే ట్రిప్ కాగా మరో లైన్ ద్వారా విద్యుత్‌సరఫరా పునరుద్ధరించారు. సోమవారం ఉదయం సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఎన్పీడీసీఎల్ ఏడీఈ లక్ష్మణ్, ఏఈలు మధుబాబు, ప్రతాప్ పర్యవేక్షించగా, సిబ్బంది కొండల్, కిరణ్, ధన్‌రాజ్, అబ్దుల్లా, వెంకటేశ్వర్లు ప్రాణాలకు తెగించి పనులు నిర్వహించారు. చెరువు లోతు ఉండటం, చెరువులో తీగజాతి చెట్లు ఉండటంతో స్థానిక మత్స్యకారుల సాయంతో తెప్పలు వేసుకుని విద్యుత్ స్తంభం వద్దకు వెళ్లి మరమ్మతులు పూర్తి చేసి, విద్యుత్ సరఫరాను పున:రుద్ధరించారు. కాగా విద్యుదాఘాతంతో చెరువులో సుమారు రూ. లక్ష విలువైన చేపలు మృతి చెందాయి. దీంతో తమకు పరిహారం అందించాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్ష కార్యదర్శులు గొర్రె సాంబయ్య, కంటే మహంకాళి, పూర్ణచందర్ రావు, పిడుగు వెంకటేశ్వర్లు, చప్పిడి వెంకటేశ్వర్లు తదితరులు అధికారులను కోరుతున్నారు.

పండుగ పూట రైతు ఇంట విషాదం

అప్పుల బాధతో ఆత్మహత్య



వెంగళరావు (ఫైల్)



తలకొరివి పెడుతున్న కూతురు

జూలూరుపాడు: భోగి మంటలు ఆరకముందే ఆ ఇంట్లో చితి మంటలు అంటుకున్నాయి. అంతా సంక్రాంతి పండుగ సందడి నెలకొనగా ఓ రైతు ఇంట్లో విషాదం నెలకొంది. అప్పుల బాధ గిరిజన రైతును బలితీసుకుంది. ఈ సంఘటన మండల పరిధిలోని అన్నారుపాడు గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకోగా, ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై పోటు గణేష్ కథనం ప్రకారం.. మండలంలోని అన్నారుపాడు గ్రామానికి చెందిన రైతు బాదావత్ వెంగళరావు(45)కు ఎకరన్నర సొంత భూమి ఉంది. దీనికితోడు ఈ ఏడాది మరో రెండున్నర ఎకరాలు కౌలు తీసుకున్నాడు. మొత్తం నాలుగు ఎకరాల్లో మిర్చి తోట సాగు చేశాడు. పంటకు వైరస్ సోకడంతో తీవ్రంగా నష్టపోయాడు. కౌలు, పెట్టుబడికి రూ.5 లక్షల వరకు అప్పు తెచ్చి పెట్టాడు. వెంగళరావుకు నలుగురు కూతుళ్లు కాగా, గతేడాది ఇద్దరికి వివాహం చేశాడు. పెళ్లిళ్ల కోసం కూడా అప్పులయ్యాయి. పంట నష్టపోయి అప్పు తీరే మార్గం కనిపించలేదు. దీంతో ఏమీ చేయాలో తెలియక మనోవేదనకు గురవుతున్నాడు. శుక్రవారం పొలానికి వెళ్లిన వెంగళరావు ఎంతసేపటికీ ఇంటికి రాలేదు. దీంతో కూతురు వెళ్లి చూడగా పురుగుల మందుతాగి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. వెంటనే కుటుంబీకులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. కుమారులు లేకపోవడంతో మూడో కూతురు నవ్య తలకొరివి పెట్టింది. వెంగళరావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుని భార్య బాదావత్ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

అంతా సిద్ధం..

- బీఆర్ఎస్ బహిరంగ సభకు భారీ బందోబస్తు
- ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్ ఏర్పాట్లపై పోలీసుల సూచనలు
- 18న ఉదయం 6నుంచి రాత్రి 11గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు



ఖమ్మంక్రైం: ఖమ్మం నూతన కలెక్టరేట్‌తో పాటు కంటివెలుగు రెండో దశను సీఎం కేసీఆర్ సహా కేరళ, పంజాబ్, ఢిల్లీ సీఎంలు ప్రారంభించనున్నారు. అనంతరం కలెక్టరేట్ సమీపాన జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభలో వీరే కాకుండా పార్టీల ముఖ్య నేతలు పాల్గొననున్నారు. ఈనేపథ్యాన 18న బుధవారం ఉదయం 6నుంచి రాత్రి 11 గంటల వరకు ఖమ్మం వైపునకు వచ్చే సాధారణ, భారీ వాహనాలను మళ్లించనున్నారు. వాహనాల మళ్లింపు, సభకు వచ్చే వారి వాహనాల పార్కింగ్ ఇతర అంశాలను పోలీసులు వెల్లడించారు.

రూట్ల వారీగా వాహనాల మళ్లింపు ఇలా...

- పెనుబల్లికి రానున్న సత్తుపల్లి, రాజమండ్రి వెళ్లే వాహనాలు తిరువూరు వయా మైలవరం నుంచి విజయవాడ వైపు మళ్లిస్తారు.

సత్తుపల్లి, రాజమండ్రివైపు నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనాలు తల్లాడ మీదుగా ఏన్కూరు, తిమ్మారావుపేట, ముచ్చర్ల క్రాస్ రోడ్డు మీదుగా డోర్నకల్ వైపు దారి మళ్లిస్తారు.

- కొత్తగూడెం, తల్లాడ వైపు నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనాలు ఏన్కూరు, తిమ్మారావుపేట, ముచ్చర్ల క్రాస్ రోడ్డు మీదుగా డోర్నకల్, మహబూబాబాద్ మీదుగా వెళ్తాయి.
- తల్లాడ, సత్తుపల్లి, రాజమండ్రి వైపు నుంచి హైదరాబాద్, వరంగల్ వెళ్లే వాహనాలు వైరా టౌన్ మీదుగా పాలడుగు, బోనకల్, చిల్లకల్లు వైపు దారి మళ్లిస్తారు.
- పల్లిపాడుకు ఏన్కూరు, జన్నారం వైపు నుంచి వచ్చే వాహనాలు వైరా, పాలడుగు, చిల్లకల్లు హైవే మీదుగా దారి మళ్లిస్తారు.
- ఇల్లెందు రోడ్డులోని ముచ్చర్ల క్రాస్‌రోడ్డు వైపు వచ్చే వాహనాలను డోర్నకల్, మహబూబాబాద్ వైపు దారి మళ్లిస్తారు.
- ఖమ్మం నుంచి ఇల్లెందు వైపు వెళ్లే వాహనాలు రామన్నపేట, డోర్నకల్, మహబూబాబాద్ నుంచి వెళ్లాలి.
- సూర్యాపేట, కోదాడ తదితర ప్రాంతాల నుంచి ఖమ్మం వచ్చే వాహనాలను విజయవాడ హైవేకు మళ్లిస్తారు.

నియోజకవర్గాల వారీగా పార్కింగ్

- ఇల్లెందు, కారేపల్లి, కామేపల్లి, రఘునాథపాలెం నుంచి వచ్చే వారు రఘునాథపాలెం యాపిల్ క్రాస్‌రోడ్డు నుంచి వైఎస్సార్ కాలనీ మీదుగా పార్కింగ్-3లో వాహనాలను నిలపాలి. అక్కడినుంచి తిరుగు ప్రయాణంలో వైఎస్సార్ కాలనీ, రఘునాథపాలెం క్రాస్‌రోడ్డు మీదుగా వెళ్లిపోవాలి.
- కొత్తగూడెం, భద్రాచలం వైపు నుంచి వచ్చే జనం.. కొత్తగూడెం, తల్లాడ, వైరా, కొణిజర్ల మీదుగా పార్కింగ్-7కు చేరుకోవాలి. తిరిగి ఇదే మార్గంలో వెళ్లాలి.
- పినపాక నియోజకవర్గం కార్యకర్తలు కొత్తగూడెం, తల్లాడ, వైరా, కొణిజర్ల మీదుగా పార్కింగ్-11కు చేరుకోవాలి. తిరిగి ఇదేమార్గంలో ప్రయాణించాలి.
- అశ్వారావుపేట వైపునుంచి వచ్చే కార్యకర్తలు వీఎం బంజర, తల్లాడ, వైరా, కొణిజర్ల మీదుగా పార్కింగ్-11కు చేరుకుని.. తిరుగు ప్రయాణంలోనూ ఇదే మార్గం అనుసరించాలి.